

# పాపాయమ్మ శీలం!

శ్రీ మహంకాళి శ్రీరామమూర్తి.

కాలుస్తూ కాలుస్తూ వున్న చుట్టతీసి చేత్తో పట్టుకుని, "అది ఏటు మనిషే నర్రా సరప్పా?" అని ప్రశ్నించాడు, కరణం బంగార్రాజు,—ఆచాయనే లేడిచూపులు చూస్తూ, మందగమనంతో పోతూవుండే ఒక కాపు పడుచును చూసి.

కాళ్లు పడుతూ వున్న మంగలిసరప్ప గిర్రున తిరిగి చూసి, "సిత్తం, మనూరికి కొత్తమనిషినా గుందండి, చెలవైతే ఆరాతీత్తానండి" అన్నాడు భయభక్తి వినయాలతో.

"ఉఁ! ఇంకా సందేహమెందుకు? కూడాపోయి సంగతి కనుక్కురా?" అని ఆజ్ఞాపించాడు బంగార్రాజు.

ప్రభుభక్తి పరాయణుడగు సరప్ప ఆ హరిణాక్షిని వెంటాడిస్తూ త్రుటిలో నిష్క్రమించాడు. ఆ కాపుపడుచు సందుదాటి అదృశ్యమయ్యే పర్యంతం కూడా కరణం యొక్క రాగపూరిత నేత్రాలు ఆమె ధరించిన నీలికోక మీదే నృత్యం చేశాయి; అతడి కాలు సవిలాంగా వూగుతూనే వుంది; అతడిచెయ్యి అప్రయత్నంగా ఆ కత్తుల్లాంటి మీసాల్ని నులిపెడ్తూనే వుంది. ఆ పిల్ల సందు దాటి అదృశ్యురాలైంది. ఒక్ఖ దీర్ఘ నిట్టూర్పు బుచ్చాడు, బంగార్రాజు. మళ్లా యథాప్రకారంగా చుట్ట నోట్లో పెట్టుకుని ప్రశాంతంగా పొగవదుల్తూ, నిమీలిత నేత్రుడై, భావ ప్రపంచంలో వీర విహారం చేయసాగాడు.

* * *

బంగార్రాజు వయస్సు నలభై యేళ్లు. చక్కటి మనిషి—రాచబిడ్డని మించి వుంటాడు. ఉప్పాడ జరీపంచ, గ్లాస్కో చొక్కా, చెవులకు పుష్యరాగాల కమ్మలజోడు, ఒంటిచేతికి రవ్వలుచెక్కినబంగారు కడియం, వేళ్ళకు రవ్వల ఉంగరాలు, కాళ్ళకు ముత్యపు చిప్పలు పొదిగిన చెడావులు, నొసట నాజూకైన తిరుచూర్ణపురేఖ, కళ్ళకు సుర్మా, బట్టతల, బలిష్టకాయం—యిదీ అతగాడి వర్ణన. గొప్ప గుర్రపురౌతు. నూరు ఆమళ్లలో చక్కటిపిల్ల వుందంటే, నూరు చిటికలు వేసేసరికి గుర్రంమీద వెళ్లి అక్కడ వాలగల సమర్థతున్న మనిషి.

నడుస్తూన్నది నాలుగో కళత్రం. యేభార్యలవల్లనైతేం అదివరకు ఆర్గురు సంతానం. (ఇది ఇంట్లో మాట

సుమండీ!) ఇప్పుడు మళ్లా కొత్తభార్య గర్భవతి. ఊళ్ళో ఇతగాడు దూరని కొంపలేదు. గొప్పరసగ్రహణ పారీణుడు. ఇతగాడికి ఆదర్శగ్రంథం రసగంగాధరం!

ఊళ్లో అతడెరగని ఆడమనిషంటూ లేదు. సాయంకాల మప్పుడు తాంబూలం వేసుకుని గుర్రమెక్కి ఊరంతా "చక్కర్లు" కొడ్తూంటే, అవకాశముంటే వీధి గుమ్మంలోంకి, లేకుంటే పెరటి గుమ్మంలోంచి, డాబా వుంటే డాబా మీదికివచ్చి అతగాడికి దాసోహం అనని నవలారత్నం లేదు. సాయంత్రమప్పుడే నిశ్చయం చేసుకుంటాడు, ఫలానా అని. సరప్ప అంతా రైటు చేసేస్తాడు మర్నాడు మరొక గుంపు—దినదినైక నూతన వనితా ప్రియుడు!

౨

మంగలి సరప్ప గుండె లెగురవేస్తూ చక్కా వొచ్చాడు. "ఏం జరిగిందిరా?" అని కనుబొమ లెగరవేసి ప్రశ్నించాడు, బంగార్రాజు.

"సిత్తం, ఆ మడిసిది నగరవటండి. ఇక్కడ సుట్టాలుంటే సూట్టాని కొచ్చిదటండి!"

"ఎవరింటికీ...?"

"—రింటికండి.—"

"ఇంకా యెన్నాళ్లుంటుందో?"

"తద్దిలే దాకా వుంట దటండి."

"ఎవరు చెప్పారు నీకు?"

"ఆ మడిసే సొప్పిందండి."

"సంగతేవన్నా కదిపావా?"

"అబ్బోసి! కొత్తపిట్ట బాబయ్యా, ముందే కదిపితే ఎగిరిపోద్ది."

"దాని మొగుడు...?"

నగరంలో పోలీసిలాకాలో వనటండి."

"అయితే రాలేదన్న మాటే కూడా?"

"నేదండి."

"సరే, అంతవరకు బాగా నేవుంది....అచ్చమ్మ చెవిని బడేశావా...సంగతి?"

"సిత్తం. ఆ పిల్లదాన్నప్పుడే పలకరించి చూసిందటండి."

"ఏమైనా, అచ్చి మహా తెలివైనముండ! మీరిద్దరూ నాకు కుడిభుజం, ఎడం భుజమూను! ఈ పిట్టని పట్టుకుంటే ఇద్దరికీ చెరో బస్తా గింజలూ కొలిపిస్తా."

"సిత్తం, పెబువులమాట కాదనగలమూ?"

"ఊ! అయితే, ఇంకా ఏం చెప్పింది?"

"సిత్తం, పిల్లదాని వాటమంతా సూస్తే మొగ్గేనాగే అగపడద్దటండి! నెమ్మదిగా సనువు సేసుకుని కతంతా బోదిత్తదటండి!"

"భేష్! నువ్వుకూడా వోకన్నుంచు, పిల్లమీద."

"సిత్తం!"

రెండు నిమిషాలపాటు ఏదో ఆలోచిస్తాడు కరణం శ్రీ రామచంద్రుని ముందరి ఆంజనేయుల్లా చేతులు కట్టుకు నుంచుంటాడు సరప్ప.

"సిత్తం, మాపిడికి రంగమ్మని......?"

"సూరిగాడి వాదినో?"

"సిత్తం, సెంగుమాసిందటండి!"

"—పూరెల్లి చిట్టిని కలుసుకొన్నావా?"

"సిత్తం! ఈమధ్య మొగుడు తూర్పెడతాట్టండి. అప్పుడొచ్చి మనూళ్ళో ఒక వారంపాటు మకాం సేత్తానందండి!"

"మరి, పూజారారి కోడలూ?"

"సిత్తం! ఆయమ్మగోర్కి పేణమీన్మాదకొస్తే ఈధులో మెట్టారండి."

"శివశివా! ఎప్పుడ్రా?"

"మాపిటికాణ్ణుంచి ఈదులోనే వుండండి."

"మరి, తాతయ్యా తాలూకు?"

"ఆయమ్మని సీతారాంపురం సాయిబు లెగదీసుకు పోనాడండి."

"పాపి! మొన్నే కాదట్రా కాపరాని కొస్తా! అప్పుడే అంతటిదైందా?"

"సిత్తం! ఈయాల్టికి రంగమ్మే అనువుగా ఉన్నాదండీ."

"సరే,……?"

"అరకాయ శానాండీ?"

"చాలు. వెళ్లు."

సరప్ప వెళ్లిపోగానే కరణం భోజనానికి లేస్తాడు.

3

గవళ్ల అచ్చమ్మ ఊరంతటికీ పేరుమోసిన దూతిక. ప్రపంచంలో ఇంక అంత నేర్పు చాకచక్యంగల దూతికను మరి చూడబోము. విరహతాపంతో వ్యధనందే వాళ్లకి అచ్చమ్మ నామధేయం అమృతతుల్యం. దాని చెవిని పడవేస్తే సరి, దేవలోకంనుంచి రంభ సేనాసరే రెక్కట్టుకుని లాక్కురాగల సమర్థురాలు. ఇప్పటికి, యీయిలాఖాలో అచ్చమ్మకి నలభైయేళ్ళ అనుభవం—అది పట్టన కేసు నెగ్గి తీరవల్సిందే. ప్రబంధనాయకులూ, ప్రబంధకాంతలూ, అన్యోన్యం కలుసుకోనేటందుకు అంతంత లేసి బాధలు పడి, చెలులనేడ్పించి, వాళ్లేడ్చి, పువ్వుల్ని తిట్టి, చంద్రుణ్ణి తిట్టి, వాళ్లని తిట్టి, పీళ్లని తిట్టి, చివరకు బ్రహ్మాష్టోబ్రహ్మ మయ్యాక, యౌవనం దాటిపోయాక కలుసుకోనేవారు గాని అప్పుడే గనుక మన అచ్చమ్మదగ్గరకు సలహాకు వస్తేనా……?

వాడి అమ్మకడుపు బంగారంగాను, ఆదుష్యంతుడు గాడు కణ్వాశ్రమమంతా చిందులుతొక్కి-పాశేశి దానా గడ్డికరచి అంత రిదంగం చేశాడుగదా శకుంతలకోసం, అప్పుడే గనక నలకంత అచ్చమ్మకి తెలియబరిస్తే, సంజీవి తేవడానికి పోయిన హనుమంతుళ్ళా రెండు కుప్పిగంతులేసి నిముషాలమీద శకుంతలని అతగాడిపరం చెయ్యలేక పోయిందా?

చెప్పొచ్చే సంగతేమంటే. ఆమనిషికి అంత మంచి నీళ్ళప్రాయం, తార్చడమంటే. ప్రపంచానికి తను చేసిన సేవకి, ఆ మహాతల్లికి ప్రత్యేకం ఒక స్వర్గం తయారై వుంటుంది పైన. కొన్నాళ్ళనుంచి ఈవిడ తనపనిమీదనే వుండాలని కరణం బంగార్రాజు ఖరారుచేశాడు. తెల్లవారిలేస్తే ఈవిడ ఊళ్ళోకి కొత్త కొత్త పిట్టలేమేమి వచ్చాయో, అందులో వీధెక్కి 'తెయితెయి లాడేవేవో, వ్యతిరేక స్వభావంగలవేవో' కనిపెడుతుండడం యీమె వృత్తి. ఫలానా చిన్నది నామనస్సు హరించిందని ఎవరేనా అనటం తడవు, తిన్నగా వెళ్ళి అపిల్లదాని రెక్కట్టుకుని ఖచ్చితంగా తీసుకొచ్చేయటమే! అదేమిటో గాని ఈ 'తాసికలమారి' మొహం చూడగానే, అరుంధతేనా సరే బుద్ధిమార్చేసుకుని వెంట బడ్తుంది.

పాపాయమ్మ ఆఊరువచ్చిన నాడే ఆవిడతో పరిచయం కలగజేసుకుంది అచ్చమ్మ. నాలుగురోజుల్లో కల్లా యిద్దరికీ అదోమాదిరి జోస్తీ యేర్పడ్డది. పాపాయమ్మ మనస్సు అసలు చాలా నిర్మలమైనదే, కాని, ఈ మాయావి సంగతి తెలియక పూర్తిగా చనువిచ్చేసింది. దానికి తోడు సమయంకూడా అట్లాంటిదే వచ్చింది—భర్త దగ్గరలేదు; చసే పనిలేదు; బంధువులు కొంచం వియ్యాలవారి వరస—యేమంటే ఆవిడ యేమనుకొంటుందో అని వాళ్లకి మొగమాటం. అచ్చమ్మని కొంపకి జేరనివ్వకుండా చేతామా అంటే అచ్చమ్మ నోరు మహా చెడ్డది—ఆ నోటికి జడిసి ప్రతివాళ్లూ ఆమెకు తావిచ్చేవారు. ఆంచేత……వారి విషయంలో……ఏమీ అనలేకపోయారు, మొహమాటంకొద్దీ.

అచ్చమ్మ పాపాయమ్మవద్దకు నిత్యం రాకపోకలు సాగిస్తూ వచ్చింది. ప్రతిదినం, నీలాశ్రేవులో కలుసుకుని సరప్ప కూడా పిల్లదాన్ని చూచాయగా పల్కరిస్తూ యేదో ప్రసంగం తెచ్చి కథలోకి దింపుదామని చూసేవాడు. కాని మొగవాడవటంచేత అచ్చమ్మకున్న చొరవ తనకు లేకపోయింది. కరణంగారు తొందరపడుతున్నారు.

ఇంక ఆయన కోరిక త్వరగా నెరవేర్చటం వుత్తమ మని అచ్చమ్మ భావించింది.

ఒకరోజున తగిన సమయంచూసి అచ్చమ్మ తన మనసులో సంగతి వెడల గ్రక్కింది, పాపాయమ్మ దగ్గిర. కరణాన్ని ఆపాదమస్తకం వర్ణించి, ఇంక అంతటి రూపసిని, రసికాగ్ర గణ్యుణ్ని చూడబోమంది. ఆ మహానుభావుడు వాంఛించడమేచాలు...ఎంత స్త్రీకేనా సరే తన అరచేతిలో దివ్యలోకం చూపిస్తాడంది. చివరకు, అంతటి యోగ్యుడిపేరు మీదుగా ఒక్క కుర్రవాణ్ని చంకనెత్తుకుంటే చాలదా, ఇటు ఏడుతరాలవారు, అటు ఏడుతరాలవారు, తరించరా అని బోధచేసింది. కావలిస్తే భత్యాలుకూడా ఏవన్నా ముట్టచెప్పిస్తానని, ఈ కరువురోజుల్లో చివరకు ఒక కోక గుడ్డ దొరికినా, అదే పదివేలు గాదా అంది.

ఆ ఉపన్యాసమంతా తుదంటా వింది పాపాయమ్మ. ఆ లేతచెక్కులు యెర్రబారాయి—కళ్లల్లోంచి నిప్పుకణాలు దూకేట్టున్నాయి. కాని మనస్సులో నున్నంత ఆవేశమూ బయట పెట్టలేక పోయింది. ఆ అమాయకురాలు—"నీసంగతి తెలియకుండా నా స్నేహం పట్టడం నాదే తప్పు, నిన్ననట మెందుకు? సరే, అయిందేదో అయింది. నేను నువ్వనుకొనేటంత నీచురాలను కాను, ఇంక నీ దార్ని నువ్వు వెళ్లవచ్చు" అని మృదువుగా మందలించింది.

కథ అడ్డుతిరిగిందే అని కొంచెం విచారించి, కొత్త మూలాన అలా అన్నదేమో ననుకొని; ఒకవేళ ఇదివరలో అల్లాంటిది కాకపోయినా, యిక ముందు తన పద్ధతులమీద తర్ఫీదు చేయడాని కింకా అవకాశముందని భావించి, బాగా ఆలోచించుకో, మళ్లా వస్తానని చెప్పి, ఆవేళకి వెళ్లిపోయింది, అచ్చమ్మ.

౪

పాపాయమ్మపట్ల అచ్చమ్మ తంత్రం పారలేదు. తన వాక్చక్యమంతా వ్యయపరచి చూచింది. కాని పాపాయమ్మ హృదయం గట్టిది. కరణం చాలా దీనంగా కబురంపించాడు ఒక దస్కం సమర్పించు కొంటానని. అది కూడా కాలిగోటితో నెట్టి పారవేసింది పాపాయమ్మ.

ఇది ఇలా వుంటూండగా ఒకనాడు సాయంత్రం అసురసంజవేళ, పాపాపాయమ్మ చెంబూ నీళ్ళూ పుచ్చుకుని ఊరికి దూరంలోనున్న పుంతలోకి వెళ్లటం, ఆది అచ్చమ్మ చూట్టం తటస్థించింది. తక్షణం కరణం బాబుకి తెలిసిందా వార్త.

అంతే! సరప్పని వెంటవేసుకుని పుంతముట్టడించాడు బంగారాజు. తన అపాయస్థితి పాపాయమ్మ గుర్తించుకొంది. కేకవేసినప్పటికి ఊరు దూరం కావటంచేత ఎవరికీ వినబడదు. అప్పుడే చీకటి పడుతూండడంచేత చుట్టుప్రక్కల పొలాల్లో పనిచేసే వాళ్లుకూడా ఇళ్లకు పోయివుంటారు. పాపాయమ్మ చాలా ఖంగారుపడ్డది.

పుంత రోడ్డుకో కలిసే జంక్షన్లో సరప్ప గస్తీ తిరుగుతున్నాడు. పుంతకి రెండోవైపున అచ్చమ్మ భీకర రూపం దాల్చి దోవ అరికట్టేసింది. తనకు సమీపంలో చుట్టముట్టించి, మీసం తిప్పుతూ కరణం నిలువబడి సరాగంగా చూస్తున్నాడు—పాపాయమ్మ పద్మవ్యూహంలో చిక్కుబడ్డది. ఆమె ప్రాణాలు నిలువునా ఎగిరిపోయాయి.

చూస్తేకార్యంలేదు—కరణం వికృతంగా చూస్తూ మెల్లిమెల్లిగా మీదకి కదం తొక్కుకొస్తున్నాడు. కాని అబల, ఏం చెయ్యగలదూ? శరీరబలం లేకపోయినా దేవుడిచ్చినబుర్ర సక్రమంగా వినియోగిస్తే ఎట్టి ప్రమాదాలేనా దాటి బయట పడవచ్చుగా?—పాపాయమ్మకు వొక ప్లాను తట్టింది. అదే గనక పనిచేస్తే బ్రతికి బయటపడ్డదే!

సినిమా ప్రభాశంకర్ చూపులు చూస్తూ బంగారాజు పాపాయమ్మని సమీపించి, ఎదురుగా పర్వతంలా నిలుచుని భయంకరంగా ఆ పొడవైన చేయి సాచాడు, పట్టుకునేందుకు. పాపాయమ్మ గుండెల్లో విమానాలు పరుగెత్తాయి. కాని, మరుక్షణంలోనే విశేషధైర్యం తెచ్చుకొని "ఆగండి" అంది, గంభీరంగా.

మనిషివద్ద ఎంత రసికత్వముండో అంతకు వేయి రెట్లు తాపీ, తరణంవుంది, కరణందగ్గిర. చిర్నవ్వు నవ్వుతూ చేయి వెనక్కు లాగివేసుకున్నాడు. "ఏం చిన్నదానా, ఇన్నాళ్లకు నామీద నీకు దయవచ్చిందా?" అని కళ్లల్లోంచి కామబాణాలు విడిచాడు బంగార్రాజు.

ఓరి వెర్రిమొహమా అనుకొని, పైకి లొంగిపోయినట్లు నటిస్తూ, సరప్పనీ, ముసలిదాన్ని పంపించివేస్తే తనకి యేవిధమైన ఆభ్యంతరం లేదంది. విశేషించి తను లోబడ్డ సంగతి రెండోకంటివాడికి తెలియరాదంది పాపాయమ్మ. ఆవిడ వొప్పుకున్న తరువాత యింక వాళ్ళ అవసరమేముంది? పొమ్మని ఆజ్ఞాపించాడు దూతికనీ, ముసలివాణ్ణీను. ప్రభుకార్యం యిన్నాళ్లకు నెరవేర్చాంగదా అని గర్వపడుతూ వాళ్లిద్దరూ ఊళ్ళోకి దారితీశారు.

కొంతసేపటిదాకా కరణం ఆమాటా, ఈమాటా ఆడేడు పిల్లదానితో. దేహందేహం తాకకుండా యెన్ని కబుర్లు చెప్పినా విన్నది పాపాయమ్మ. చివరకి మీదకి దూకడం ప్రారంభించాడు కరణం. ఆలశ్యం చేయకుండా తాను వేసిన ప్లాను ఆమలులో పెట్టింది పాపాయమ్మ—గుప్పెడు యిసుకతీసి అతడి మొహానికి గురిచూసి కొట్టి; ఆచెంబులోవున్న నీళ్లు నెత్తిన దిమ్మరించి, పరుగు తీసింది. కొంతసేపటికి కళ్లువిప్పి చూడగలిగాడు కరణం—ఇంకెక్కడి పాపాయమ్మ? ఈపాటికి ఊరుజేరుకొని వుంటుంది. అప్పుడేగనుక సరప్పా, అచ్చమ్మ వుండి అడ్డగిస్తేనా......? కాని అది చేతులు కాలేక ఆకులు పట్టుకోవడం! హసి దండుముండకానా అనుకుని, ఉగ్రుడై ఇంటికి దోవతీశాడు కరణం.

౫

కరణంయొక్క దౌర్జన్యం పాపాయమ్మద్వారా బంధువుల చెవి సోకింది. అంతా కలిసి గూడుపుఠాణీచేసి, మర్నాడు ప్రొద్దున్నే రెండెడ్ల బండీమీద పాపాయమ్మని వాళ్లవూరు పంప్పించేసే యేర్పాటుచేశారు. పాపాయమ్మ ప్రాణాలు రువ్వురువ్వుమంటూ వున్నాయి.

ఆశా భంగంతో కూడుకొన్న కోపంచేత అదివరకే ప్లానువేసి వుంచాడు కరణం. బండివాడు మద్దత్తయ్యాడు. ఊరుదాటాక కొంత దూరంలో వున్న రాధారీ బంగాళావద్ద పాపాయమ్మ యెక్కివెళ్ళే బండిని ఆపివేసి, పాపాయమ్మని, దౌర్జన్యంచేసి బంగాళాలోకి తీసుకుపోయి, కరణం తన యిచ్ఛ తీర్చుకొనే యేర్పాటు.

మర్నాడు ఉదయం మంచి శకునంచూసి పాపాయమ్మ బండెక్కింది. కొంతసేటికి బండిరహదారీ బంగాళా సమీపించింది. బండివాడు ఎద్దుకాలుకి నొప్పిచేసిందనే వంకమీద బండినిలిపి పాపాయమ్మని దిగమన్నాడు. పాపాయమ్మ దిగింది. ఎక్కణ్ణుంచో సరప్ప, అచ్చమ్మ చక్కావొచ్చి పాపాయమ్మ రెక్కపట్టుకుని "పద, బంగాళాలోకి పద" అని గదిమారు. పాపాయమ్మ పెంకితనంగా రానంది. ముసల్ది మీద మీదకొచ్చి పళ్లు రాలగొడ్తానంది. అంతట్లోకి మీసం ఒడిపెడ్తూ కరణంకుడా చక్కావొచ్చాడు. అతడ్ని చూడగానే పాపాయమ్మకి మరీ దిగులుపుట్టింది. "మాయముండకానా, కళ్ళల్లో ఖారం కొడ్తావా? ఈ మాటెక్కడికి పోతావం"టూ పాపాయమ్మ రెక్క పట్టుకుని బంగాళా వైపు బరబరా యీడ్చాడు కరణం.

పాపాయమ్మ క్యారుమంది. వీపుమీద ఒక్కటి వేశాడు కరణం. అప్పుడా బంగాళా తలుపులు తెరచుకుని లోనుండి ఒక దృఢకాయుడు యీవలకువచ్చి ఒక బడిత తీసుకుని కరణం వీపు చిట్లగొట్టాడు. సరప్పా, అచ్చమ్మ దూటేశారు. కరణం చిత్తైపోయి దాసోహమన్నాడు, ఆనూతనాగంతుకుడికి.

ఆవ్యక్తి పాపాయమ్మ భర్త! నగరం పోలీసుస్టేషన్నుండి ఒక చోరీ విషయమై ఎంక్వైరీకి ఆఊరే, ఆకరణంవద్దకే వస్తూ కాస్త ప్రయాణపు బడలికతీర్చుకుందామని ఆబంగాళాలో విశ్రమించి, పాపాయమ్మ ఆర్తనాదంవిని బయటకొచ్చాడు. చూస్తే తన భార్యే! జరిగిన సంగతంతా భర్తతో చెప్పుకుంది ఆశీలవతి. పోలీసాయన కరణాన్ని మింగేలా చూశాడు. కరణం క్షమార్పణ చెప్పుకొన్నాడు. మరొకడైతే ఆవేళ చావురాసిందే!

కరణంతో తనకుగల పనిచూసుకుని ఆపోలీసాయన పాపాయమ్మతో ఆ బండిమీదనే నగరం వెళ్లిపొయ్యాడు.